క్లుప్తంగా

పందెనపల్లి వాసికి డాక్టరేట్



కిరణ్‌ను సన్మానిస్తున్న మల్లికార్జున యాదవ సంఘం ప్రతినిధులు

కట్టంగూర్: మండంలోని పందెనపల్లి గ్రామానికి చెందిన ఆవుల కిరణ్ బయో టెక్నాలజీలో వైరాలజీ విభాగం నుంచి డాక్టరేట్ పొందాడు. ఒరిస్సాలోని బయోటెక్నాలజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ భువనేశ్వర్‌లో ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్‌గులాం హుస్సేన్ పర్యవేక్షణలో 'హైటైటీస్ సీ–వైరస్ రూపాంతరం' అనే అంశంపై పరిశోధన చేసినందుకు కిరణ్‌కు డాక్టరేట్ దక్కింది. డాక్టరేట్ అందుకున్న కిరణ్‌తోపాటు అతడి తల్లిదండ్రులు లక్ష్మి, నర్సింహలను శుక్రవారం మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెద్దగొల్ల ముప్పిడి యాదయ్య, సంకటి నాగరాజు, గజ్జి లింగయ్య, గజ్జి రవి, గంట ప్రవీణ్, కావటి యాదగిరి పాల్గొన్నారు.

'మంత్రి కోమటిరెడ్డి ఉద్యోగుల పక్షపాతి'

మునుగోడు: ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షన్‌దారుల సమస్యలను గుర్తించి ఒకటో తేదీన వేతనాలు అందేలా కృషిచేసిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి ఉద్యోగుల పక్షపాతి అని టీఎన్‌జీఓ చండూరు తాలుకా అధ్యక్షుడు పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పదేళ్ల తరువాత ఒకటో తేదీన వేతనాలు అందించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, అందుకు కృషిచేసిన మంత్రి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఆ సంఘం కార్యదర్శి సతీష్, నిఖిల్, రాజు, నర్సింహ, వాహీద్ తదితరులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ పర్యటన హాస్యాస్పదం'

చండూరు(గట్టుప్పల్): కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీని పునరుద్ధరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు కాళేశ్వరం పర్యటనకు వెళ్లడం హాస్యాస్పదంగా ఉందని గట్టుప్పల్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రావుల రమేష్ అన్నారు. ఆయన శుక్రవారం గట్టుప్పల్ మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులకు ప్రాజెక్టులపై అవగాహన లేదన్నారు. కార్యక్రమంలో యాదగిరిరెడ్డి, టేకుమట్ల శ్రీరాములు, నగేష్, రవీందర్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

4న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 4వ తేదీన మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

'హాస్పిటల్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి'

నల్లగొండ టూటౌన్: కాంట్రాక్ట్ కార్మికుల ఆత్మహత్యాయత్నానికి కారణమైన ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో కార్మికులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికులను కాంట్రాక్టర్ వేధింపులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆస్తిపన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ

చిట్యాల: ఆస్తి పన్నుపై ప్రభుత్వం ప్రకటించిన 90శాతం వడ్డీమాఫీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వీరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 వరకు గల పాత ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీమాఫీ వర్తిస్తుందని, కేవలం 10 శాతం వడ్డీతో బకాయిలు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

చండూరు : గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చండూరు పట్టణంలోని గాంధీజీ విద్యాసంస్థలో శుక్రవారం సీఐ వెంకటయ్య నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రెండు సంవత్సరముల వరకు ప్రతినెలా 20 మంది నిరుపేదలకు వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు నిర్ణయం ఎంతో గొప్పదని అన్నారు. ఆర్థికంగా ఉన్న వారు ఇదే స్ఫూర్తితో పేదలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో శిరంశెట్టి శ్రీధర్‌బాబు, డాక్టర్ కోడి శ్రీనివాసులు, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ చెరుపల్లి రామయ్య, సత్యనారాయణమూర్తి, బుషిపాక యాదగిరి, బోడ విజయ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై కూలీల అనాసక్తి !

- మునుగోడు మండలంలో 11,559 జాబ్ కార్డులు
- ప్రస్తుతం రోజుకు సుమారు 2500 మంది హాజరు
- కూలీల సంఖ్య పెంచాలని సిబ్బందిపై ఉన్నతాధికారుల ఒత్తిడి



మునుగోడు పెద్ద చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి హామీ కూలీలు

మునుగోడు: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లేందుకు మునుగోడు మండలంలోని కూలీలు అంతగా ఆసక్తి చూపడం లేదు. కూలీల సంఖ్య పెంచాలని జిల్లా స్థాయి అధికారులు కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చి పదేపదే చెబుతున్నా కూలీల సంఖ్య మాత్రం పెరగడం లేదు. అందుకు ప్రధాన కారణం పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి వేతనాలు అందకపోవడమేనని పలువురు కూలీలు వాపోతున్నారు. సాధారణంగా బయట ఏ పనికి వెళ్లినా కనీసం రోజుకు రూ.500 వరకు వస్తుంది. కానీ అదే ఉపాధిహామీ పనులకు వెళ్లేవారికి రోజుకు కనీసం రూ.300 కూడా రావడం లేదని చెబుతున్నారు.

రోజుకు 2500 మంది మాత్రమే హాజరు..

మండల వ్యాప్తంగా ఉన్న 27 గ్రామాల్లో దాదాపు 22,000 కుటుంబాలు ఉన్నాయి. అందులో 11,559 కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. ఆ జాబ్ కార్డుల ద్వారా 24,000 మంది ఉపాధిహామీ పనులు చేసుకునే అవకాశం ఉంది. ప్రతి ఏటా 5374 కుటుంబాలకు చెందిన 7470 మంది ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నారు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం 2000 నుంచి 2500 మంది మాత్రమే పనులకు వస్తున్నారు.

రూ.272 అందేలా ప్రణాళిక..

నిర్ణీత కొలతల ప్రకారం కూలీలు పనిచేస్తే రోజుకు కనీసం రూ.272 అందేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. 15 రోజుల క్రితం మునుగోడు మండల వ్యాప్తంగా కేవలం 1200 నుంచి 1400 మంది కూలీలు మాత్రమే ఉపాధిహామీ పనులకు వచ్చేవారు. 15 రోజులుగా చెరువు పూడికతీత పనులు ప్రారంభించడంతో ఇద్దరు కూలీలు కలిసి రెండు ట్రిప్పుల మట్టి ఎత్తితే రోజుకు రూ.250 వేతనం అందింది. దీంతో రోజురోజుకూ కూలీల సంఖ్య పెరిగి ప్రస్తుతం 2500 వరకు చేరుకుంది. కానీ గతంలో వలే 4000 మంది కూలీలు పనులకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు కనీసం రూ.400 వేతనం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు.

కొలతల ప్రకారం వేతనం అందిస్తున్నాం



ఉపాధిహామీ పనులకు వచ్చిన కూలీలకు చేసిన పనికి కొలతల ప్రకారం వేతనం అందిస్తున్నాం. నిర్ణీత పనిచేస్తే ప్రతి కూలీకి రూ. 270 వేతనం వస్తుంది. తక్కువ పనిచేస్తే తక్కువ వేతనం వస్తుంది.
– శ్రీనయ్య, ఏపీఓ, మునుగోడు

రోజు రూ.400 ఇస్తే బాగుండు



పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు కనీసం రూ.400 వేతనం ఇస్తే బాగుండు. నెల రోజుల క్రితం వరకు రోజుకు రూ.180 మాత్రమే వచ్చాయి. 15 రోజులుగా చెరువు మట్టిని ఎత్తుతుండడంతో రోజుకు రూ.250 వేతనం వస్తోంది. అదే బయటి పనులకు వెళ్తే రోజుకు రూ.500 వస్తాయి.
– కర్నాటి పరమేష్, ఉపాధి హామీ కూలీ, మునుగోడు

బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

శాలిగౌరారం: విధి నిర్వహణలో ప్రభుత్వ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గంట లక్ష్మమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సిబ్బంది విధులు నిర్వర్తించే ప్రాంతంలోనే నివాసం ఉండి సకాలంలో విధులకు హాజరుకావాలని సూచించారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధికి కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులపై సమగ్ర నివేదిక అందజేయాలని నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. మండల అభివృద్ధి పనుల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలని కోరారు. మండలంలోని ప్రధాన రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని ప్రధాన రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, సాంకేతిక అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎర్రబెల్లి, వైస్ ఎంపీపీ కందుల అనితారెడ్డి, తహసీల్దార్ మహ్మద్ అన్వర్‌హుస్సేన్, ఎంపీడీఓ లక్ష్మయ్య, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామాల ప్రత్యేక అధికారులు, పాల్గొన్నారు.

కులాలకు అతీతంగా ఉత్సవాల్లో పాల్గొనాలి



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

మునుగోడు: కులమతాలకు అతీతంగా నిర్వహించే ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ పాల్గొని ఐక్యత చాటిచెప్పాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామ శివారులోని సైదులు దర్గా వద్ద జరుగుతున్న ఉర్సుకు శుక్రవారం ఆయన హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవాలతో ఆ గ్రామ ప్రజలతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. సైదులు దర్గా ఉర్సులో మునుగోడు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలతోపాటు సంస్థాన్ నారాయణపురం, చిట్యాల మండలాలకు చెందిన ప్రజలు భారీసంఖ్యలో పాల్గొంటారని, ఉర్సుకు వచ్చే భక్తులకు ప్రభుత్వం ప్రత్యేక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, బొడిగె అశోక్ గౌడ్, జాజుల సత్యనారాయణగౌడ్, భాస్కర్‌గౌడ్, నర్సింహగౌడ్, జాజుల వెంకటేష్‌గౌడ్, దొటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు



చీకటిమామిడిలో పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్.ఐ వెంకటేశ్వర్లు

మునుగోడు: అధికారుల ఆదేశాలు పట్టించుకోకుండా గట్టుచప్పుడు కాకుండా బెల్టు షాపు కొనసాగిస్తూ మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై మునుగోడు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన నీల శేఖర్ అనే కిరాణ దుకాణం వ్యాపారి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్న సమయంలో షాపులో తనిఖీలు చేసి 15 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆకలితో అలమటించిన విద్యార్థులు

చండూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయానికి అందక ఆకలితో అలమటించారు. మధ్యాహ్న భోజనం వండే వారు తమకు సుమారు నాలుగు నెలలుగా డబ్బులు అందలేదని అకస్మాత్తుగా పనులకు ఎగనామం పెట్టారు. దీంతో మధ్యాహ్నం వరకు వేచి చూసిన పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఇతర కూలీలను పిలిపించి ఆలస్యంగా వంట తయారు చేయించారు. వంట తయారీలో ఉపాధ్యాయులు సైతం పాలుపంచుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం అందించాల్సి ఉండగా సుమారుగా 2.50 నుంచి 3 గంటల సమయంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారు. భోజనం ఆలస్యం కావడంతో విద్యార్థులు ఆకలికి తల్లడిల్లారు. గతంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు ఏజెన్సీ ఉండేది. భోజనం ఒకటి, రెండుమార్లు కలుషితం కావడంతో అధికారులు ఆ ఏజెన్సీని రద్దు చేశారు. కొన్ని సంవత్సరాలుగా పాఠశాల ఉపాధ్యాయ బృందమే కూలీలతో మధ్యాహ్న భోజనం చేయిస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భిక్షం మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు అక్టోబర్ వరకు బిల్లులు చెల్లించామని తెలిపారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే వారు విధులకు రాకపోవడంతో వంట ఆలస్యం జరిగిందన్నారు. వంట ఆలస్యం కావడంపై జిల్లా అధికారులకు సమాచారం అందించామన్నారు.

ప్రజా సేవకు పాటుపడాలి

శాలిగౌరారం: ప్రజలకు సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ తమవంతు పాటుపడాలని మండలంలోని తుడిమిడి గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు హైదరాబాద్ పవన్‌సాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకుడు ఆలేటి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రానికి వ్యక్తిగత పనులపై వచ్చిన శ్రీనివాస్‌ను మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, అడ్డగూడురు మండలం మానాయికుంట, గట్టుసింగారం గ్రామాలకు చెందిన ప్రజలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వైద్యరంగంలో రాణిస్తున్న శ్రీనివాస్ నిరుపేద కుటుంబాలకు ఉచిత వైద్య సేవలందిస్తున్నారు. స్వామిగౌడ్, గూని వెంకటయ్య, వడ్లకొండ పరమేష్, దొంతూరి శంకర్, ఆకుల శ్రీను, గుండా సోమకోటి, గడ్డం వీరయ్య, బాకి వెంకటయ్య, చౌగోని సైదులు, మాగి రవి, తోట సోమయ్య, చలకాని యాదయ్య పాల్గొన్నారు.



డాక్టర్ ఆలేటి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన



ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న తిప్పర్తి తహసీల్దార్ స్వప్న

రామగిరి(నల్లగొండ): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తిప్పర్తి తహసీల్దార్ డి.స్వప్న తెలిపారు. ఈ నెల 9 వరకు పెండింగ్ సమస్యలను పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. అపరిష్కృత దరఖాస్తుల వివరాలు కంప్యూటర్‌లో పొందుపరుస్తున్నామని అన్నారు. ఎసైన్డ్ భూములతో పాటు అన్ని రకాల వారసత్వ బదిలీ ప్రక్రియలు, జీపీఏ దరఖాస్తులు, భూ సమస్యలకు సంబంధించి వినతులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ధరణి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని భూ సమస్యలు పరిష్కారం కాని వారు నేరుగా తహసీల్దా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మునుగోడులో..

మునుగోడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మునుగోడు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక ధరణి కార్యక్రమంలో భాగంగా పెండింగ్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. రెండు, మూడేళ్లుగా వివిధ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు 9 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నారు. మునుగోడు మండల వ్యాప్తంగా 26 గ్రామాల్లో 281 మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు అధికారులు మొత్తం మూడు టీమ్‌లను ఏర్పాటుచేసి ఒక్కో టీమ్‌లో 7 గురు చొప్పున సిబ్బందిని నియమించారు. ఆ టీమ్ సభ్యులు దరఖాస్తుదారులకు ఫోన్ చేసి వారి దగ్గర గల ఆధారాలను తమకు అందించాలని సూచిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.నరేందర్, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌రెడ్డి, ఆర్.ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చిట్యాల : సపర్క్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చిట్యాల : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య కోరారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం చిట్యాలలోని 103,104,105 బూత్‌లలో మెగా బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. మోదీ పదేళ్ల పాలనలో ప్రపంచ అగ్రదేశాల సరసన భారత్ చేరిందని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 370కి పైగా స్థానాల్లో గెలుపొంది తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, జోగు శేఖర్, కూరెళ్ల శ్రీను, కుక్కల బాలమణి, కుక్కల నాగరాజు, పాల రవివర్మ, సుంచు శ్రీను, బట్టె రమేష్, పిల్లి రవి, సందీప్, నాగరాజు, సందీప్, సైదులు పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన కౌన్సిలర్



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో గాజుల సుకన్య

నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, నకిరేకల్ మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్ శుక్రవారం ఆర్ అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. నకిరేకల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

స్టడీమెటీరియల్ పంపిణీ



మెటీరియల్ అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కేతేపల్లి: మండలంలోని ఇనుపాముల జెడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ చైర్మన్ దేవరశెట్టి పెద శ్రీనివాసులు సహకారంతో సమకూర్చిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, డిస్ట్రిక్ కమిటీ చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అడెం వెంకటేశ్వర్లు, కోశాధికారి పరాకాంతం నారాయణరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కె.వెంకట్‌రెడ్డి, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఉపాధి పనులు కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న బొజ్జ చిన్న వెంకులు

నకిరేకల్: మున్సిపాలిటీ పరిధిలో ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన్న వెంకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నకిరేకల్ మున్సిపాలిటీలో ఉపాధి హామీ పనులు లేకపోవడంతో కూలీలు ఇతర గ్రామాలకు నిమ్మ, బత్తాయి తోటల్లో పని చేసేందుకు వెళుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ, ప్రతినిధులు కత్తుల లింగస్వామి, చింతపల్లి లూర్దు మారయ్య, సాకుంట్ల నర్సింహ, మర్రి బక్కయ్య, సత్తమ్మ, లక్ష్మమ్మ, శంకరమ్మ, సరోజ, విజయ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

యథేచ్ఛగా రేషన్ బియ్యం కొనుగోలు

మునుగోడు: పేద ప్రజల కోసం ప్రభుత్వం ప్రతినెలా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉండడంతో కొందరు వ్యాపారులు ఆ బియ్యంతో ప్రతినెలా లక్షలు గడిస్తున్నారు. మునుగోడు మండలంలోని కొందరు రైస్ మిల్లు వ్యాపారులు కొంత మంది చిరు వ్యాపారులను ప్రోత్సహిస్తూ ఇంటింటికీ పంపి కిలో రూ.7 నుంచి రూ.10 వరకు చెల్లించి కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేయిస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని తమ మిల్లులో నిల్వ చేసుకుని ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరించిన వారికి కిలోకు రూ.3 చొప్పున అదనంగా చెల్లిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలా సేకరించిన బియ్యం 50 క్వింటాళ్ల వరకు కాగానే తమ మిల్లుల్లో పరంగా మార్చి రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఓ వాహనంలో లోడు చేసుకుని ఫౌల్ట్రీ ఫామ్స్ అధికంగా ఉండే చౌటుప్పల్, చిట్యాల, భువనగిరి, నల్లగొండ పట్టణాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న సమయంలో ఎవ్వరైనా అధికారులు లేదా పోలీసులు పట్టుకుంటే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు రంగప్రవేశం చేసి పట్టుకున్న బియ్యాన్ని వదిలేయాలని, వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయవద్దని ఒత్తిడి తీసుకొస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతినెలా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

జీరో విద్యుత్ బిల్లులు జారీ

మాడుగులపల్లి : ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం మండల వ్యాప్తంగా గృహ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్‌శాఖ అధికారులు జీరో బిల్లులు పంపిణీ చేశారు. 200 యూనిట్లలోపు వినియోగించుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వమే బిల్లులు చెల్లిస్తుందని ఏఈ మణిదీప్ తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలి

నల్లగొండ: ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే పని రజకులకే ఇవ్వాలని ఫిబ్రవరి 26న ప్రభుత్వం కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసిందని, ఈ ఉత్తర్వులను అధికారులు వెంటనే అమలు చేయాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలోని అన్ని రకాల హాస్పిటల్స్, తదితర ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే పనిని కాంట్రాక్టర్లకు కాకుండా.. రజక సొసైటీలకే ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ద్వారా 2023 జూన్ నెలలో గత ప్రభుత్వం 102 జీఓ విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈమేరకు ఫిబ్రవరి 26న ఉత్తర్వుల జారీకి సహకరించిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, రజక ఫెడరేషన్ ఎండీ చంద్రశేఖర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దీనిని వెంటనే అమలు చేసేందుకు కలెక్టర్లు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రజక సంఘాల జిల్లా కన్వీనర్ పగిళ్ల సైదులు, భీమనపల్లి నగేష్, దామనూరు శ్రీనివాస్, జంజిరాల లెనిన్, పగిళ్ల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు జంజిరాల శేఖర్, పట్టణ నాయకులు పగిళ్ల క్రిష్ణయ్య, సట్టు శంకర్ పాల్గొన్నారు.



శతాబ్ది ఉత్సవాల్లో పాటలు పాడుతున్న గాయకులు

జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 200 కుండలాలతో మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు.
– రామగిరి(నల్లగొండ)



యజ్ఞకుండలి తీసుకెళ్తున్న ఆర్యసమాజ్ ప్రతినిధులు

గ్రామాల అభివృద్ధికి కృషి

మాడుగులపల్లి : గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మండలంలోని చెరువుపల్లి గ్రామంలో రూ.10 లక్షల ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వేముల గురవయ్య, మాజీ సర్పంచ్ సాయిలు, నాగిరెడ్డి, నరేష్, మల్లారెడ్డి, సైదులు పాల్గొన్నారు.

చెరువును పునరుద్ధరించాలి



చెరువును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

చిట్యాల : పట్టణంలోని పోతరాజు చెరువును పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎండీ అక్బర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో చిట్యాలలోని పోతరాజు చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ చెరువు అన్యాక్రాంతం కావడంతోపాటు మున్సిపాలిటీ వ్యర్థాలను చెరువులో పడవేయడం వల్ల జలాలు కాలుష్యంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువును పునరుద్ధరించి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిద్దిదాలని కోరారు. ఆయనవెంట బొలుగూరి లింగయ్య, ఎస్‌కే షరీఫ్, గుండాల సత్తయ్య ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మర్రిగూడ: మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ కార్యకర్త కక్కునూరి లింగయ్య ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంగౌడ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట రైతు సంఘం మండల కార్యదర్శి బుర్ర శేఖర్ యాదవ్, బుర్ర అంజయ్య, కల్లెట్ల లింగయ్య, గంట వెంకటేష్, గంట రాజు, గంట శ్రీను, లింగేష్, రామ్, సోమరాజు తదితరులు ఉన్నారు.



నగదు అందజేస్తున్న సీపీఐ నాయకులు